AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
5-12-2025 (Friday) MAIN EDITION

## నాలుగోరోజూ ఇండిగో విమానాలు రద్దు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. వరుసగా నాలుగో రోజూ భారీగా విమాన సర్వీసులను రద్దు చేసింది. శుక్రవారం ఒక్కరోజే దాదాపు 700లకుపైగా విమానాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ సహా దేశంలోని ప్రధాన నగరాల నుంచి బయలుదేరాల్సిన ఫ్లైట్లు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి విమానాశ్రయాల్లో అవస్థలు పడుతున్నారు.

## తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**అక్షరటుడే, తిరుమల:** తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో పది రోజుల పాటు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలలో డిసెంబర్ 23 నుంచి 2026 జనవరి నెలాఖరు వరకు పలు పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ 23, డిసెంబర్ 29, నుంచి జనవరి 8, జనవరి 25 తేదీల్లో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

## ఏసీబీకి చిక్కిన డీటీ



**అక్షరటుడే, నల్గొండ:** లంచం తీసుకుంటూ ఓ డిప్యూటీ తహశీల్దార్ ఏసీబీకి చిక్కాడు. చండూరు డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్ ఒక అక్రమ రిజిస్ట్రేషన్‌పై స.హ.చట్టం కింద వివరాలు ఇవ్వడానికి రూ.15 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్‌లో లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు.

## పాక్ సీడీఎఫ్‌గా ఆసిమ్ మునీర్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పాకిస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ ఆర్మీ చీఫ్‌గా పని చేసిన ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు మరో అత్యున్నత పదవి అప్పగించింది. పాకిస్థాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్‌గా ఆసిమ్ మునీర్‌ను నియమిస్తూ పాక్ అధ్యక్ష కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అధ్యక్షుడు జర్దారీ తాజాగా ఆమోదం తెలిపారు.

## రాష్ట్రంలో పెరగనున్న చలి తీవ్రత



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో కొద్ది రోజులుగా చలి కాస్త తగ్గింది. తాజాగా మరోసారి చలితీవ్రత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఉత్తర తెలంగాణలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయే అవకాశం ఉంది. నేటి రాత్రి నుంచే చలి తీవ్రత పెరగనుంది. శీతల గాలులు వీయనుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## విజృంభిస్తున్న స్క్రబ్ టైఫస్..

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో స్క్రబ్ టైఫస్ విజృంభిస్తుంది. దీని ప్రభావంతో ఇప్పటి వరకు రాష్ట్రంలో ఐదుగురు మృతి చెందారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విజయనగరం, పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు స్క్రబ్ టైఫస్‌తో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యాధి ప్రాణం తకమైంది. దీనిని ఇప్పటి వరకు టీకా అందుబాటులో లేదు. దీంతో ముందు జాగ్రత్తలే ఏకైక మార్గమని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఏపీలో గత కొన్నేళ్లుగా స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్నాయి. అయితే ప్రస్తుతం మరణాలు చోటు చేసుకుంటుండం ఆందోళన కలిగిస్తోంది.

## మావోయిస్టుల సంచలన లేఖ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మావోయిస్టులు మరో సంచలన ప్రకటన చేశారు. అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి తమతోనే ఉన్నారని స్పష్టం చేశారు. మావోయిస్టు వికల్ప్ పేరుతో శుక్రవారం లేఖ విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు మృతి చెందిన విషయం తెలిసిందే. అంతేగాకుండా పొలిట్ బ్యూరో సభ్యుడు దేవ్‌జీ పోలీసుల అదుపులో ఉన్నాడనే వార్తలు వచ్చాయి. వారిని వెంటనే విడుదల చేయాలని మావోయిస్టులు సైతం లేఖ విడుదల చేశారు. దేవ్‌జీపాటు మరో 50 మంది నక్సల్స్‌ను పోలీసులు పట్టుకున్నారని అందులో పేర్కొన్నారు. అయితే తాజాగా దేవ్‌జీ తమతోనే ఉన్నారని వారు క్లారిటీ ఇచ్చారు.




# ఆర్‌బీఐ బొనాంజా

■ వడ్డీ రేట్లను తగ్గించిన కేంద్ర బ్యాంక్ ■ ఏడాదిలో నాలుగోసారి కోత
■ రుణగ్రహీతలపై తగ్గనున్న భారం

**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి గుడ్‌న్యూస్ చెప్పింది. కీలకమైన వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్యాలెండర్ ఇయర్‌లో వడ్డీ రేట్లను తగ్గించడం నాలుగోసారి కావడం గమనార్హం. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశం ముగి సింది. మీటింగ్‌లో ద్వైమాసిక ద్రవ్య విధానంపై తీసుకున్న కీలక నిర్ణయాలను శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. కీలకమైన రెపో రేటును పావు శాతం తగ్గిస్తున్నట్లు తెలిపారు. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 5.5 శాతం నుంచి 5.25 శాతానికి దిగి వచ్చింది. ఈ నిర్ణయాన్ని పాలసీ కమిటీలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.** -అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి పడిపోవడం, వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టినట్లు ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. అక్టోబర్‌లో ద్రవ్యోల్బణం అత్యంత కనిష్ఠ స్థాయి అయిన 0.3 శాతానికి దిగిరావడం రెపో రేటు తగ్గింపునకు వీలు కల్పిస్తుందని కొందరు ఆర్థికవేత్తలు భావించారు. అయితే ఇదే సమయంలో జీడీపీ వృద్ధి రేటు రెండో త్రైమాసికంలో 8.2 శాతంగా నమోదైనా.. విదేశీ సంస్థాగత మదుపరులు అలుపన్నదే లేకుండా పెట్టుబడులను ఉపసంహరిస్తుండడంతో రూపాయి విలువ నానాటికీ తీసికట్టుగా మారుతుండడంతో యథాతథ స్థితిని కొనసాగించవచ్చని మరికొందరు అంచనా వేశారు. అయితే వడ్డీ రేట్లను తగ్గించాలన్న నిర్ణయానికే ఆర్‌బీఐ వచ్చింది.

### రుణ గ్రహీతలకు ఉపశమనం..

ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంతో కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గిస్తూ వస్తోంది. మార్కెట్‌లో లిక్విడిటీ పెంచడానికి ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే ఫిబ్రవరి, ఏప్రిల్‌లలో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్‌లో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఆగస్టు, అక్టోబర్‌లలో మాత్రం యథాతథ స్థితిని కొనసాగించారు. తాజా సమావేశంలో మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. నాలుగో విడతతో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు రెపో రేటు 1.25 శాతం తగ్గింది. ఇలా వడ్డీ రేట్లను తగ్గిస్తూ ఆర్‌బీఐ తీసుకుంటున్న నిర్ణయాలతో గృహ రుణాలు మరింత అందుబాటులోకి రానున్నాయి. కొత్త రుణాలతోపాటు ఇప్పటికే ఉన్న రుణాల ఈఎంఐలు తగ్గుతాయి. రూ. 50 లక్షల రుణానికి సంబంధించిన ఈఎంఐలు రూ. 3 వేలనుంచి రూ. 4 వేల వరకు తగ్గుతాయని భావిస్తున్నారు. ఆర్‌బీఐ నిర్ణయంతో గృహ, వాహన రుణ గ్రహీతలకు మరింత ఉపశమనం లభించనుంది.

### రియల్ ఎస్టేట్‌కు ఊతం..

వడ్డీ రేట్ల తగ్గింపు రియల్ ఎస్టేట్ వ్యాపార వృద్ధికి బలమైన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే హౌసింగ్ మార్కెట్ మందగమనంలో ఉన్న నేపథ్యంలో రెపో రేటు తగ్గింపు సరిగ్గా బదిలీ అయితే పెరుగుతున్న ఆస్తి ధరల ప్రభావాన్ని ఎదుర్కోవడంలో గృహ కొనుగోలుదారులకు సహాయపడనుంది. మరింత మంది గృహ కొనుగోళ్లకు ముందుకు రావడాన్ని ప్రోత్సహించనుంది. డెవలపర్లు కూడా తక్కువ రుణ భారం నుంచి ప్రయోజనం పొందనున్నారు. ఇది ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడానికి వీలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

### గవర్నర్ ప్రసంగంలోకి కీలక అంశాలు..

- ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ఈ ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 2.6 శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ ప్రకటించారు.
- జీఎస్‌టీ హేతుబద్ధీకరణతో కొనుగోళ్లు పెరగడంతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 8.2 శాతంగా నమోదయ్యింది. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నట్లు తెలిపారు.
- లిక్విడిటీ పెంచడం కోసం రూ. లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీల విక్రయాల కోసం ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌ను నిర్వహించనున్నారు.
- 686 బిలియన్ డాలర్ల వరకు విదేశీ మారక నిల్వలు ఉన్నాయని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. ఇవి రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఉపయోగపడతాయని తెలిపారు.

## పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం: పొంగులేటి



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. మొదటి దశలో ఇళ్లు మంజూరైన వారు పనులు చేపడుతున్నారు. కొందరు లబ్ధిదారుల ఇళ్లు పూర్తికావడంతో గృహ ప్రవేశాలు కూడా చేశారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. పట్టణ ప్రాంతంలో సైతం ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపై సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. మూడేళ్లలో పల్లెలతో పాటు అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పట్టణాల్లో స్థల కొరత దృష్ట్యా జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళ్తుందన్నారు. త్వరలో రాష్ట్రంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని చెప్పారు. ఏప్రిల్ నాటికి రెండో విడత ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పారు.

## రాజీనామాకు సిద్ధం..

దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు




**అక్షరటుడే, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను రాజీనామాకు సిద్ధం అని ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే రాజీనామా చేస్తానని చెప్పారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి దానం గెలుపొందారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. హస్తం పార్టీ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. స్పీకర్ విచారణకు ఇప్పటికే 8 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కడియం శ్రీహరి తనకు సమయం కావాలని స్పీకర్‌ను కోరారు. అయితే దానం మాత్రం విచారణకు హాజరు కాలేదు. ఈ క్రమంలో ఆయన రాజీనామాకు సిద్ధమని ప్రకటించడం గమనార్హం.

## డేటింగ్ వార్తలపై మృణాల్ రెస్పాన్స్ ఇదే..



**స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తుంటారు. కొద్దిరోజుల క్రితం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో ప్రేమలో ఉన్నారన్న రూమర్స్ తెగ చక్కర్లు కొట్టాయి. ఆ వార్తలపై స్పష్టత రాకముందే.. మృణాల్ గురించి మరో గాసిప్ వైరల్‌గా మారింది. టీమిండియా స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌ఓ మృణాల్ ప్రేమాయణంలో ఉన్నారన్న వార్తలు వైరల్ అవడంతో అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆస్ట్రేలియా టూర్‌లో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న శ్రేయస్ అయ్యర్ – మృణాల్‌తో ఎప్పుడు ప్రేమాయణం కొనసాగించాడు, అసలు వారిద్దరి లవ్ స్టోరీ ఎప్పుడు మొదలైందోనని నెటిజన్లు ప్రశ్నలు వేసుకుంటున్నారు. వరుస రూమర్స్‌పై ఇటీవల మృణాల్ ఠాకూర్ స్పందించారు. తనపై వస్తున్న గాసిప్స్ గురించి మాట్లాడుతూ, ఇలాంటి పుకార్లు వినడమే హాస్యాస్పదంగా ఉంటుంది. ఇవన్నీ నాకు ఉచితంగా వచ్చే పీఆర్ స్టంట్స్ లాంటివే" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.** —అక్షరటుడే, సినిమా వెబ్‌డెస్క్

## భారత్ శాంతి వైపే ఉంటుంది : మోదీ




**అక్షరటుడే, ఢిల్లీ:** భారత్ ఎప్పుడు శాంతి వైపే ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత్ రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు జరిగింది. ఆరంభంలోనే పుతిన్‌తో శాంతి గురించి ప్రధాని మాట్లాడారు. ఉక్రెయిన్-రష్యా వివాదం దౌత్య, శాంతి చర్చల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ తటస్థంగా లేదని చెప్పారు. భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే ఉంటుందని పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ శాంతి మార్గంలోకి వస్తాయని ఆకాంక్షించారు.

### గాంధీకి నివాళి

పుతిన్ ముందుగా రాజ్‌ఘాట్‌లోని మహాత్మ గాంధీ సమాధికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. పుతిన్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ఘన స్వాగతం పలికారు. అనంతరం మోదీ-పుతిన్ భేటీ అయ్యారు. పుతిన్ విజన్‌కు భారత్, రష్యా ఒప్పందాలే ఉదాహరణ ప్రధాని పేర్కొన్నారు. రెండు దేశాల సంబంధాలకు చారిత్రక నేపథ్యం ఉందన్నారు. తనను భారతదేశానికి ఆహ్వానించినందుకు ప్రధాని మోదీకి పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గురించి పుతిన్ మాట్లాడుతూ, శాంతియుత పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశం అనంతరం ఇరు దేశాల అధినేతలు సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

## శబరిమలలో ఉద్రిక్తత..



**అక్షరటుడే, కేరళ:** శబరిమలలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. తెలుగు భక్తులపై స్థానిక వ్యాపారులు దాడి చేశారు. దీంతో ఓ భక్తుడి తలపగిలింది. అయ్యప్ప స్వామి దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలి వెళ్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది అయ్యప్ప స్వాములు దర్శనం కోసం వెళ్తున్నారు. ఈ క్రమంలో తెలుగు భక్తులపై తాజాగా దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది. వాటర్ బాటిల్ ధర ఎక్కువ ఉందని అడిగినందుకు షాపు యజమాని గాజు సీసాతో భక్తుడి తల పగులగొట్టాడు. దీంతో పెద్ద ఎత్తున తెలుగు రాష్ట్రాల భక్తులు షాపు వద్దకు చేరుకున్నారు. షాపు వద్ద నిల్చొని నిరసన తెలిపారు. వ్యాపారులను, భక్తులను పోలీసులు అడ్డుకున్నారు. భక్తుడి తలపై గాజు సీసాతో దాడి చేసి, హైదరాబాద్ నగరానికి చెందిన ఒక భక్తుడి మాలను వ్యాపారి తెంపేసినట్లు తెలుస్తోంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ భక్తులు ఆందోళన చేపట్టగా.. స్థానికులు ఆ వ్యాపారికి అండగా రావడం గమనార్హం. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కూడా వ్యాపారులకే మద్దతు తెలుపుతున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.